క్లుప్తంగా

ఘనంగా నరసింహదేవర వర్ధంతి

ఆలమూరు: దేశ సహకార సంఘ ఉద్యమ పితామహుడు, మాజీ ఎమ్మెల్సీ నరసింహదేవర సత్యనారాయణమూర్తి వర్ధంతి శనివారం ఘనంగా జరిగింది. స్థానిక బొబ్బా చిన వీరన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు వైట్ల సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించగా సభ్యులు చల్లా నానాజీ, చిర్రా శ్రీనివాసు పాల్గొన్నారు. దక్షిణ భారత దేశంలోనే తొలిసారిగా ఆలమూరులో కోఆపరేటివ్ బ్యాంకును స్థాపించి సహకార స్ఫూర్తికి దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన నరసింహదేవరను పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నరసింహదేవర మునిమనవడు శ్రీనివాసశాస్త్రికి పాలకవర్గ సభ్యులు పూలమాలలు, దుశ్శాలువా వేసి సత్కరించి మెమెంటో బహూకరించారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు చక్రవర్తుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం కూడా భక్తులు పోటెత్తారు.

ఈవ్‌టీజింగ్ జోలికి పోవద్దు

రాజోలు: ఈవ్ టీజింగ్‌ను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని రాజోలు ఎస్సై పృథ్వీ విద్యార్థులకు సూచించారు. శనివారం బి.సావరం శోభనా స్కూల్ విద్యార్థులకు ఈవ్ టీజింగ్, బైక్ రైడింగ్‌లపై ఎస్సై పృథ్వీ అవగాహన సదస్సు నిర్వహించారు. తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలన్నారు. మైనర్లకు బైక్ ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కరస్పాండెంట్ ఫాదర్ జోసఫ్, ఫాదర్ మార్కో, ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, బెర్నా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఆత్రేయపురం: సీఎం జగన్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఆసుపత్రుల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శనివారం ఆత్రేయపురం పీహెచ్‌సీ వద్ద రూ.50 లక్షలతో నిర్మించనున్న పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం, రూ.5 లక్షలతో ఆయుర్వేద భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ కప్పల శ్రీధర్ పాల్గొన్నారు.

భక్తులకు భారీ అన్న సమారాధన

పి.గన్నవరం: గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా స్థానిక గరుడేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బాల గణపతి స్వామివారి పందిరిలో శనివారం భక్తులకు పెద్ద ఎత్తున్న అన్న సమారాధన చేశారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలకు శివాలయం సర్కిల్ యూత్ సభ్యులు ఆధ్వర్యం వహించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి

- 'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రారంభం
- పాల్గొన్న కలెక్టర్ హిమాన్షుశుక్లా, ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు, వరప్రసాదరావు


రావులపాలెంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి


అయినవిల్లిలో అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు


సఖినేటిపల్లి మెడికల్ క్యాంపులో వైద్యసేవలను పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా

రావులపాలెం/మామిడికుదురు/సఖినేటిపల్లి/ఆలమూరు/ఆత్రేయపురం/రాజోలు/కొత్తపేట/అయినవిల్లి/అంబాజీపేట/పి.గన్నవరం/మలికిపురం: రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. శనివారం రావులపాలెం సచివాలయం-1 పరిధిలోని స్థానిక వేమన రెడ్డి కల్యాణ మండపంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి లక్ష్మి వెంకట నాగదేవి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


జొన్నాడలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


అంబాజీపేటలో రోగుల వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

▸▸ మామిడికుదురు మండలం కొమరాడలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వలవల పెదబాబు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావుదొర తదితరులు పాల్గొన్నారు.

▸▸ సఖినేటిపల్లి సచివాలయం-2 కింద గీతామందిరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా సందర్శించారు. శిబిరంలో రోగులకు వైద్య సిబ్బంది అందజేస్తున్న సేవలను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు.

▸▸ ఆలమూరు మండలం జొన్నాడలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి ప్రారంభించారు. 458 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

▸▸ రాజోలు మండలం సోంపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు. సుమారు 300 మంది వైద్య శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందారని పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ఫణికిరణ్ తెలిపారు.

▸▸ కొత్తపేట మండలంలోని మోడేకుర్రులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంతో జీవించాలన్నదే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు.

▸▸ అయినవిల్లి మండలంలోని అయినవిల్లి పెదపేటలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు.

▸▸ అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎంపీడీఓ కె.సత్యనారాయణ, డీటీ పద్మల పర్యవేక్షణలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు నిర్వహించారు.

▸▸ పి.గన్నవరం మండలం నరేంద్రపురంలోనూ జేహెచ్‌ఎస్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రారంభించారు.

▸▸ మలికిపురం మండలం మేడిచర్లపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ హిమాన్షుశుక్లా ఎమ్మెల్యే రాపాకతో కలసి పరిశీలించారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు

కొత్తపేట: రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధిలో పరుగులు తీస్తున్నాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని మోడేకుర్రులో ఎంపీ, ఓఎన్జీసీ, మండల పరిషత్ నిధులు రూ.18 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని, కమ్యూనిటీ, ఓఎన్జీసీ నిధులు రూ.9 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓ పక్క ప్రజల ఆర్థికాభివృద్ధికి తద్వారా వారి జీవన స్థితిగతులు మార్చేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మరో పక్క పరిపాలన ప్రజలకు చేరువ చేసేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి దాని ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. దానికి అనుబంధంగా వైద్య సేవలందించేందుకు వెల్‌నెస్ సెంటర్, రైతులకు అందుబాటులో సేవలకు ఆర్‌బీకే, యువత విజ్ఞానానికి డిజిటల్ లైబ్రరీ తదితర భవనాలు నిర్మించిందన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖను అన్ని విధాలా బలోపేతం చేసిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.ముక్కంటి, అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, సర్పంచ్‌లు కుడుపూడి రామలక్ష్మి, రెడ్డి చంటి, నెల్లి లక్ష్మీపతిరావు, సాగి బంగార్రాజు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మామిడిశెట్టి ఏడుకొండలు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చోడపనీడి చిన్న తదితరులు పాల్గొన్నారు.


మోడేకుర్రులో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

మేధావులను తయారు చేయడం ఉపాధ్యాయులకే సాధ్యం

రావులపాలెం: ప్రపంచ మేధావులను, దేశ నాయకులను, దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలను, క్రీడాకారులను, ఎంతో మంది డాక్టర్లను, ఇంజినీర్లను, లాయర్లను, సమాజానికి ఉపయోగకరమైన పనులు చేసే అందరినీ తయారుచేసే సత్తా ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని ప్రభుత్వ విప్, చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం ఉండడం వలన కార్యక్రమం నిర్వహించడానికి వీలుపడక పోవడంతో శుక్రవారం రాత్రి రావులపాలెంలో మల్లిడి కనికిరెడ్డి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని 51 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీలు మార్గన గంగాధరరావు, కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, జెడ్పీటీసీలు గూడపాటి రమాదేవి, కుడుపూడి శ్రీనివాసరావు, బోణం సాయిబాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, ముత్యాల వీరభద్రరావు, తమ్మన శ్రీను, కనుమూరి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న పోస్టాఫీసు సొంత భవనం కల

రాజోలు: కొన్ని దశాబ్దాలుగా అద్దె భవనంలో సేవలు అందించిన రాజోలు హెడ్ పోస్టాఫీసుకు సొంత భవనం కల నెరవేరింది. శనివారం రాజోలు పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో రూ.2.40 కోట్లతో హెడ్‌పోస్టాఫీసు భవనం నిర్మాణానికి అమలాపురం ఎంపీ చింతా అనురాధ, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావులు శంకుస్థాపన చేశారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ రాజోలు హెడ్‌పోస్టాఫీసు భవనం నిర్మాణానికి కొన్ని దశాబ్దాలుగా స్థల సేకరణలో తీవ్రజాప్యం జరిగిందన్నారు. స్థలం సేకరణ త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుని భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామన్నారు. భవన నిర్మాణ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు అన్ని ఒకే చోటకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే గ్రామ సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం నూతన భవనాలు నిర్మాణం పనులు పూర్తి చేశారని త్వరలో వాటిని ప్రారంభిస్తామన్నారు. రిటైర్డ్ సీపీఎంజీ ముత్యాల వెంకటేశ్వర్లు, అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీధర్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వంశీ, హెడ్ పోస్టు మాస్టర్ పి.సత్యనారాయణ, జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, మట్టా ఏడుకొండలు, బండారు కాశీ తదితరులు పాల్గొన్నారు.


హెడ్‌పోస్టాఫీసు భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే రాపాక

గుండె ఆరోగ్యం భద్రం

మలికిపురం: ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యంను భద్రంగా చూసుకోవాలని మలికిపురం రోటరీ క్లబ్ అధ్యక్షుడు సోమిశెట్టి మురళీకృష్ణ సూచించారు. రోటర్లీ క్లబ్ ఆధ్వర్యంలో లక్కవరం పంచాయతీ దగ్గర అంతర్జాతీయ హార్ట్ డే సందర్భంగా రోటరీ ఇంటర్నేషనల్ 3020 సేవా కార్యక్రమంలో భాగంగా లక్కవరం పీహెచ్‌సీ సహకారంతో ప్రాజెక్ట్ ఆన్ పాజిటివ్ హెల్త్ సంస్థ ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రోగులకు బీపీ, సుగర్, వయసును బట్టి బరువు, ఎత్తు, గుండెకి సంబంధించిన ఈసీసీ 2 డి ఎకో తదితర అంశాలపై పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ దుర్గాప్రసాద్ రోగులను పరిశీలించి వ్యాధి నిర్ధారణకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది తమ తమ సమస్యలను తెలుసుకొని కావలసిన మందులు, మల్టీ విటమిన్ సిరప్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్, కార్యదర్శి బందెల సంపత్, ట్రెజరర్ తోలేటి సతీష్, సర్పంచ్ కోట పుష్పకుమారి, మంగెన సింహాద్రి, మంగెన నరసింహారావు, కొడవాటి దొరబాబు, గుర్రం జాషువా, రొటేరియన్లు రుద్రరాజు వెంకటరామరాజు, గెడ్డం తులసి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి పోషణ అవసరం

అంబాజీపేట: సంపూర్ణ ఆరోగ్యానికి పోషణ అవసరమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొండేటి వికాస్‌బాబు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో సీడీపీఓ వై.విజయశ్రీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంవీఎస్‌వీ మహాలక్ష్మిల పర్యవేక్షణలో అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహారంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిరు ధాన్యాలు, ఆకు కూరల్లో పోషకాలు మెండుగా ఉన్నాయని, వాటిని ఆహారంతో విధిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.శాంతకుమారి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో భరత్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం సీఎంవో అడిషనల్ సెక్రటరీ (సీఎంవోఏసీ) ఎన్.భరత్ గుప్తా కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పూర్ణ కుంభంతో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ ఏసీ వి.సత్యనారాయణ అందజేశారు. ఆర్డీవో ఎస్.వసంతరాయుడు, సూపరింటెండెంట్ పి.విజయ సారథి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి భాస్కరరావు

రావులపాలెం: విద్యార్థులు చట్టాలు, రాజ్యాంగ హక్కులు, విధులపై అవగాహన పెంపొందించుకోవాలని కొత్తపేట జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి అధ్యక్షతన డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు కె.రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కొత్తపేట జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో యువత చెడు వ్యసనాలకు లోనై మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారన్నారు. యువత సక్రమ మార్గంలో పయనించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా తయారుకావాలన్నారు. చదువులను సక్రమమైన మార్గంలో చదివి కృషి పట్టుదలతో చదవాలన్నారు. ప్రణాళికబద్ధంగా చదివితే సాధించలేనిది ఏదీ లేదన్నారు. సమాజంలో ప్రాథమిక హక్కులు, చట్టాలు, న్యాయ, ధర్మాలను గౌరవించాలని ప్రాథమిక విధులను తెలుసుకుని నడుచుకోవాలని సూచించారు. విద్యార్థులు ర్యాగింగ్, వంటి చెడ్డమార్గాలను విడనాడాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అల్లు భాస్కరరావు, కె.రాజారావు, కొత్తపేట ఎస్సై డి.శశాంక, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుపరిపాలనతో సువర్ణాధ్యాయం


మహిళకు బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనతో సువర్ణాధ్యాయానికి నాంది పలికారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం పొన్నమండలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాపాక నిర్వహించారు. వినాయక గుడి వీధి, బుడగ జంగాల కాలనీ, శాంతినగర్ కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే రాపాక వివరించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ఇతర రాష్ట్రాల కంటే ఏపీ ముందంజలో ఉందన్నారు. సర్పంచ్ కుక్కల బేబి కుమారి, జెడ్పీటీసీ మట్టా శైలజ, సొసైటీ చైర్మన్ కడలి సత్యనారాయణ, నాయకులు సత్తిబాబురాజు, చేకూరి చంటిరాజు, కంచర్ల శేఖర్, యెనుముల నారాయణస్వామి, గెడ్డం బుల్లిబ్బాయి, స్టాలిన్, కుక్కల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం

సఖినేటిపల్లి: డాక్టర్ బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కార గ్రహీత, శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌ను, మోరి మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ ఓగూరి టాండన్ రాజు సత్కరించారు. శనివారం మోరిలో మహిమ సీపీసీ కార్యాలయం వద్ద జరిగిన ఒక కార్యక్రమంలో ఆయనతో పాటు ఏఎంసీ చైర్మన్ ఇంజేటి శామ్యూల్‌రాజు సత్కరించారు. సీపీసీ మెంబర్స్ ఇంజేటి జీవన్‌రాజు, తోట జాన్‌బాబు, గెడ్డం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్నకు ప్రముఖుల పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వెంకన్న ఆలయంలో శనివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్రప్రసాద్, టీటీడీ ధర్మకర్త మేకా శేషుబాబు స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వార్ని ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరిసత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారికి స్వామి చిత్రపటం, ప్రసాదాలను చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు.

షెడ్డుకు ఆర్డీవో శంకుస్థాపన

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయం ప్రాంగణంలో శనివారం భక్తుల సౌకర్యార్థం పంచాయతీ రాజ్ శాఖ నుంచి మంజూరైన రూ.6,90,000 గ్రాంటుతో నిర్మించే షెడ్ పనులకు అమలాపురం ఆర్డీవో ఎస్.వసంతరాయుడు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి పూజలు నిర్వహించారు. ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, పీఆర్ డీఈ వి.శ్రీరామకృష్ణ, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను, ఎంపీటీసీలు బైర నాగరాజు, పోతాబత్తుల భాస్కరరావు, సూపరింటెండెంట్ విజయసారథి పాల్గొన్నారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

రాజోలు: ప్రజల ఆరోగ్యమే శ్రీరామరక్షగా ప్రభుత్వం తలస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం సోంపల్లిలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ఇప్పటికే తాటిపాకలో భవనం నిర్మాణం పూర్తి చేశామని, ఇతర ప్రాంతాల్లో భవనాల నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రాజోలు సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, పార్టీ నాయకులు తిరుమాని రాజు, కటా సత్యానారాయణ, బొమ్మిడి వెంకటేష్, కుంపట్ల చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం


బాధితులకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో మంచాన పడిన తల్లీ కొడుకులకు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు శనివారం రూ.16 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన షేక్ సలీం, అతని తల్లి షేక్ బషీర్‌ను పోషించుకుంటూ ఒక అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. సలీం తండ్రి 15 సంవత్సరాల క్రితం కుటుంబాన్ని విడిచి పెట్టి ఎక్కడికో వెళ్లిపోయాడు. రెండు సంవత్సరాల నుంచి సలీం పెరాలసిస్‌తో మంచాన పడ్డాడు. అతని తల్లికి ఇటీవల ప్రమాదంలో కాలు విరిగి మంచాన పడింది. పేదరికంతో ఇబ్బంది పడుతున్న వీరి దుస్థితిని స్థానికులు కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులకు తెలియజేసి సాయం కోరారు. దీంతో కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.16 వేల నగదు, రెండు బియ్యం బస్తాలు, నిత్యావసరాలను సాయంగా అందజేశారు.